క్లుప్తంగా

వినతిపత్రం అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వం జూన్ 1 నుంచి భూములు, స్థలాల మార్కెట్ విలువను పెంచే నిర్ణయం తీసుకుందని, నిర్మాణ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నరేడ్కో) సెంట్రల్ జోన్ అధ్యక్షులు కె.ముక్తేశ్వరరావు అన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరుతూ శనివారం రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవీంద్రనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరేడ్కో కోశాధికారి వేణుమాధవ్, సభ్యుడు సందీప్ పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కమిటీ కో కన్వీనర్‌గా న్యాయవాది రాజు




భవానీపురం(విజయవాడపశ్చిమ): బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) మానవ హక్కుల కమిటీ కో కన్వీనర్‌గా భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన న్యాయవాది వీఎన్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మానవులందరికీ కులం, మతం, జాతి, భాష, ప్రాంతం, లింగబేధం లేకుండా కొన్ని మౌలిక హక్కులు ఉంటాయని రాజు తెలిపారు. స్వేచ్ఛగా, హుందాగా జీవించే హక్కు, బానిసత్వం, హింస నుంచి స్వేచ్ఛ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, విద్య హక్కు వంటివి మరెన్నో ఉన్నాయని వివరించారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చిన బీబీఏ ప్రెసిడెంట్ కేబీ సుందర్, జనరల్ సెక్రటరీ జున్ను శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ పుప్పాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

కొలుకలూరి కోయిలమ్మ రావూరి బుల్లెమ్మ గ్రంథావిష్కరణ



విజయవాడ కల్చరల్: శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తనా అకాడమీ ఆధ్వర్యాన ఎంజీ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సంగీత విద్వాంసులు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్, బుల్లెమ్మ నిర్వహించిన అన్నమయ్య సంకీర్తన స్రవంతి, పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనల ప్రచారం చేస్తున్న గాయని బుల్లెమ్మ జీవిత విశేషాలను తెలియజేస్తూ సుభద్ర రచించిన కొలకలూరి కోయిలమ్మ, రావూరి బుల్లెమ్మ గ్రంథాన్ని వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి ఆవిష్కరించారు. సంగీత విద్వాంసురాలు మాధవపెద్ది మీనాక్షి, మోదుమూడి సుధాకర్, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ ప్రసంగించారు. గాయని బుల్లెమ్మను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. బాలకృష్ణప్రసాద్, బుల్లెమ్మ అన్నమయ్య సంకీర్తనలను మధురంగా గానం చేశారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి



విజయవాడ కల్చరల్: స్వరఝరి నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్ర సదనంలో శనివారం నిడమర్తి లోహితదత్త నిర్వహించిన కచేరీ.. శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. వాగ్గేయకారులు రచించిన పలు సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. యువ సంగీత కళాకారులు మల్లాది సింధు రాగేశ్వరి వయోలిన్‌పై, మల్లాది శివానంద యశస్వి మృదంగంతో సహకరించారు. స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ ప్రసంగించారు. సంగీత కార్యక్రమం నిర్వహించిన నిడమర్తి లోహితదత్త సంగీత ప్రయాణం అంశంపై మాట్లాడారు.

టెన్త్ విద్యార్థులకు నేడు ప్రతిభా పురస్కారాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకున్న 2023 ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 550కు పైగా మార్కులు పొందిన విద్యార్థులకు తమ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామని మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ప్రకటనలో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ సిలబస్‌లో పదో తరగతి ఫలితాల్లో 550 మార్కులు, సీబీఎస్ఈ ఫలితాల్లో 450 పైగా మార్కులు పొందిన విద్యార్థులకు ఉదయం 9 గంటలకు మొగల్రాజపురం రత్నమాంబ వీధిలోని తమ విద్యాసంస్థ ఆవరణలో పురస్కారాలను అందజేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్ కార్డు, స్కూల్ ఐడీకార్డుతో పాటుగా పదో తరగతి మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ) తీసుకు రావాలని తెలిపారు. వివరాలకు 89781 80842, 93812 61727 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వలంటీర్ల వ్యవస్థతో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వలంటీర్లకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పరిపాలనలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఒక విప్లవమని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శనివారం గవర్నర్‌పేటలోని ఐ.వి.ప్యాలస్‌లో వలంటీర్‌కు వందనం కార్యక్రమం జరిగింది. ఉత్తమ సేవలందించిన 28, 29, 31, 32, 33, 36 డివిజన్లకు చెందిన వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి 320 మంది వలంటీర్లకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ నిస్వార్థ సేవలకు ప్రతిరూపం వలంటీర్ల వ్యవస్థ అని కొనియాడారు. వలంటీర్లు అని చిన్నచూపు చూసే వారంతా తలదించుకునేలా... గొప్ప సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తున్నారని కితాబిచ్చారు. పాలన వికేంద్రీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన సచివాలయాలు, వాటికి అనుబంధంగా నెలకొల్పిన వలంటీర్ వ్యవస్థ చక్కని సత్ఫలితాలిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించడం, అర్హులతో దరఖాస్తు చేయించడం వంటి పనుల్లో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ నుంచి ఉన్నతాధికారుల వరకు అధికార యంత్రాంగం పటిష్టంగా పని చేస్తున్న కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సెంట్రల్ ముందంజలో ఉందన్నారు.

వలంటీర్లు సేవా సైనికులు

జగనన్న సంక్షేమ రాజ్యంలో వలంటీర్లే సేవా సైనికులని మల్లాది విష్ణు పేర్కొన్నారు. సంక్షేమ వ్యవస్థలో నూటికి నూరు శాతం జవాబుదారీదనంగా వలంటీర్లు వ్యవహరించడంతో.. ప్రజల్లో సంతృప్త స్థాయి పెరిగిందన్నారు. ప్రాణాలకు తెగించి వలంటీర్లు అందించిన సేవలు నిరుపమానమన్నారు. అందుకే వారి సేవలకు గుర్తుగా ఇప్పటికి మూడుసార్లు ప్రభుత్వం అవార్డులు అందించిందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజన, సీడీఓ జగదీశ్వరి, కార్పొరేటర్లు బాలి గోవింద్, శర్వాణీ మూర్తి, కొంగితల లక్ష్మీపతి, పెనుమత్స శిరీష సత్యం, కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి పాల్గొన్నారు.

జగనన్న పాలన స్వర్ణయుగం



గడప గడపకు మన ప్రభుత్వంలో పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్ర చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిపోతుందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శనివారం నియోజకవర్గంలోని ఒకటో డివిజన్‌లోని 4వ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఉద్దంటి సునీతతో కలిసి సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగారు. తొలుత స్థానిక శ్రీ బాల అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు వెళ్ళినప్పుడు ప్రజల నుంచి వస్తున్న స్పందన తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే టీడీపీ హయాంలో మీ ప్రచార ఆర్భాటాలకు బలైన 29 మంది కుటుంబాలకు మహానాడు వేదికగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిపై త్వరలో శ్వేత పత్రం విడుదల చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో డీఈ(యూజీడీ - వాటర్ సప్లై) రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరి, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, నాయకులు ఉద్దంటి సురేష్, కొండా మహేశ్వర్ రెడ్డి, పిల్లి కృష్ణవేణి, బండి వేణు, సన్యాసిరాజు, కొంగితల శివ, కనకరావు, మందాది వెంకట్రావు, నాగరాజు, కొలకలేటి రమణి, వై.శ్రీనివాస్, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటీ అండ్ గవర్నెన్స్ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మంత్రి రమేష్, హేమచంద్రారెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో రూపొందించిన పాలిటీ అండ్ గవర్నెన్స్ పుస్తకాన్ని శనివారం రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి ఆవిష్కరించారు. నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ సివిల్స్‌లో మంచి ర్యాంకులు సాధించేందుకు మన ప్రాంతంలోనే మంచి శిక్షణ సంస్థలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు మంచి ర్యాంకులు సాధించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఐఏఎస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా ప్రదర్శన



ప్రదర్శనలో వస్త్రాలు తిలకిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని బాపు మ్యూజియం(విక్టోరియా)లో భావనారుషి చేనేత హస్త కళా కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో చేనేత హస్త కళా ప్రదర్శన ప్రారంభమైంది. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేనేత ప్రదర్శన ప్రారంభించారు. ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. పలు డిజైన్ల చేనేత ఉత్పత్తులు, వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉత్పత్తి అయిన చేనేత వస్త్రాలను ఒకేచోట విక్రయించడానికి ప్రదర్శన ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. ఉత్పత్తిదారులే నేరుగా తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారని, నెల రోజులపాటు సాగే ప్రదర్శనను ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు బట్టు సురేష్, అందే సింహాద్రి మాట్లాడుతూ వచ్చే నెల 25 వరకు ప్రదర్శన అమ్మకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆత్మకూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మనసున్న నేత సీఎం జగన్

- ఎన్టీఆర్ అందరికీ ఆరాధ్య దైవం
- పండగలా ఇళ్ల పట్టాల పంపిణీ
- ఎన్టీఆర్ సర్కిల్ మీకు రాసిచ్చారా
- వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



మాట్లాడుతున్న దేవినేని అవినాష్, పక్కన కడియాల బుచ్చిబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ పేరు జిల్లాకు పెట్టిన మనసున్న నేత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. అందరికీ ఆరాధ్య దైవమైన ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గుణదలలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేవినేని అవినాష్ మాట్లాడుతూ ఎన్టీఆర్, వైఎస్సార్ అంటే నా తండ్రి నెహ్రూకు ఎంతో అభిమానమన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా ఎన్టీఆర్ పేరు ప్రస్తావనకు కూడా రాకుండా చేశారని ఆరోపించారు. ఎన్టీఆర్ పేరును చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోయేలా జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు.

టీడీపీ నేతలకు నిద్రపట్టడం లేదు

దమ్మున్న మొనగాడిలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల తరపున పోరాడి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. అమరావతిలో పండగలా జరిగిన కార్యక్రమాన్ని చూసి టీడీపీ నేతలు, ఎల్లో మీడియాకు నిద్ర పట్టడం లేదన్నారు. అధికారంలోకి వస్తే ఇళ్ల పట్టాలు రద్దు చేస్తామనడానికి టీడీపీ నేతలకు సిగ్గుందా అని ప్రశ్నించారు.

మీకు రాసిచ్చారా

పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లో బ్యానర్‌లు కడుతుంటే ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కవ్వింపు చర్యలకు పాల్పడటం, ప్రజలను రెచ్చగొట్టాలని చూడటం దుర్మార్గమన్నారు. మేమూ ఎన్టీఆర్ అభిమానులమే అని, బ్యానర్‌లు కట్టే హక్కు మాకు ఉందని దేవినేని అవినాష్ అన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ టీడీపీకి ఎవరూ రాసివ్వలేదని, అది వాళ్ల పార్టీ ఆఫీసు కాదన్నారు. ధనబలం, ఎల్లో మీడియా ఉందని ప్రజలను రెచ్చగొట్టాలని చూడటం సరికాదని హితవు పలికారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేత కడియాల బుచ్చిబాబు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జొన్నలగడ్డకు ఎన్టీఆర్ స్మారక పురస్కార ప్రదానం



జొన్నలగడ్డకు ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, లక్ష్మీకాంత శర్మ తదితరులు

విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆంధ్ర మహాసభ బెంగళూరు, భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు, రంగస్థల నటుడు జొన్నలగడ్డకు ఎన్టీఆర్ పురస్కారం, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాలను దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని ప్రభుత్వం కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేరుతో జిల్లా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ తెలుగు చిత్రసీమలో ఎన్టీఆర్‌ది స్వర్ణయుగంగా అభివర్ణించారు. రంగస్థల నటుడు పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ సంస్థ లక్ష్యాలను వివరించారు. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా రంగస్థల నటుడు జొన్నలగడ్డ జగన్మోహనరావుకు ఎన్టీఆర్ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. బత్తుల కీర్తన కూచిపూడి నృత్యాలు, వి.ఏడుకొండలు భక్తాంజనేయ ఏకపాత్రాభినయం, డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ ఆధ్వర్యంలో శ్రీకృష్ణరాయబారం పద్యనాటకంలోని యుద్ధ సన్నివేశాన్ని ప్రదర్శించారు. కళాకారుడు పీవీఎల్ నృసింహం, భాస్కరశర్మ పాల్గొన్నారు.

కులగణన కమిటీ ఏర్పాటుపై హర్షం



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీకాంత్, శివరామకృష్ణ, గాయత్రి సంతోషి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీలో కులగణన చేపడతామని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరుగురు అధికారులతో అధ్యయన కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో శనివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, వడ్డీల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సైదు గాయత్రి సంతోషి, భట్రాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి దేవి, నాగవంశీ నాయకులు బొడ్డు అప్పలనాయుడు, అత్తులూరి రాజేంద్రప్రసాద్, ధనాలకోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చాడంటే చేస్తాడంతే అన్న నానుడి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నుంచే మొదలైందని ఏపీ కుమ్మరి/శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండెపూడి పురుషోత్తం అన్నారు. బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన చాంబర్‌లో శనివారం సాయంత్రం సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గుమ్మడాల బసవేశ్వరరావు, ఓబులుశెట్టి మోహన్‌బాబు, రామకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోట చలసాని నగర్‌లో నివసిస్తున్న సౌందర చందు(43) క్యాటరింగ్ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శ్రీలక్ష్మి హోటల్‌లో పనికి వెళ్తుంటుంది. చందుకు మద్యం సేవించే అలవాటు ఉంది. ఇటీవల అప్పులు పెరగడంతో భార్యకు చెప్పి బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం సేవించి పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నాడు. రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. రాత్రి 10.30 గంటల సమయంలో శ్రీలక్ష్మి లేచి చూడగా అతను రేకుల షెడ్డు రాడ్‌కు లుంగీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సాయంతో కిందకు దించి 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది అతనిని పరీక్షించి చూసి మృతి చెందినట్లు నిర్ధారించారు. అప్పుల బాధతో తన భర్త ఉరేసుకుని మృతి చెందాడని శనివారం మృతుని భార్య శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈత నిషేధం

కృష్ణా తీరంలో హెచ్చరిక బోర్డులు



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణా నది తీరం వెంబడి పలు ప్రాంతాల్లో కృష్ణలంక పోలీసులు కృష్ణానదిలో ఈత కొట్టడం నిషేధమని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల సరదాగా నదిలోకి ఈతకు వెళ్లి అనేక మంది యువకులు మృత్యువాత పడిన ఘటనలు అనేకం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కృష్ణలంక పీఎస్ సీఐ ఎం.వి.దుర్గారావు ప్రజలను హెచ్చరిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సీఐ దుర్గారావు మాట్లాడుతూ నదిలో సుడిగుండాలు ఎక్కువగా ఉన్నాయి, ఎవరూ నదిలోకి ప్రవేశించవద్దని, ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.

1 నుంచి పురుషోత్తమ భారతీస్వామి నగర యాత్ర

విజయవాడ కల్చరల్: శృంగేరి శివగంగ పీఠాధిపతులు శ్రీ పురుషోత్తమ భారతీస్వామి జూన్ 1వ తేదీ నుంచి 7 వరకు విజయయాత్రలో భాగంగా దుర్గాపురంలోని శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో విడిదిచేస్తారని శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ శారద చంద్రమౌళీశ్వర్లుకు ప్రత్యేక పూజలు, సామవేద పారాయణ, పురాణం మహేశ్వర శర్మతో శ్రీ మద్భాగవతం అంశంగా ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. స్వామి వారి అనుగ్రహ భాషణ జరుగుతుందని తెలిపారు.

కొనసాగుతున్న వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామివారికి హారతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావుబుచ్చయ్యకాలనీ లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు రెండోరోజుకు చేరుకున్నాయి. స్వామివారికి విశేషంగా సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. క్షీరాభిషేకం, లోక కల్యాణార్థం ప్రత్యేక హోమాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి పర్యవేక్షించారు.

నేడు శ్రీదేవి భూదేవి శిలాబింబాల ప్రతిష్ట, స్వామివారి కల్యాణం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో శ్రీ దేవి భూదేవీ శిలాబింబాల ప్రతిష్ట, స్వామివారి కల్యాణం జరుగుతుందని ఆలయ అర్చకులు అంగలూరి రంగాచార్యులు తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వన్యప్రాణుల చట్టం కింద చంద్రబాబును అరెస్ట్ చేయాలి

ఆకుల శ్రీనివాసకుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వన్యప్రాణుల సంరక్షణ చట్టం సెక్షన్ 51 -1ఎ 1972 కింద చంద్రబాబును అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం రాజమండ్రిలో నిర్వహించిన టీడీపీ మహానాడులో ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఒక అభిమానితో నెమలి పింఛం దండ వేయించుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. దీన్ని చూస్తే రాజ్యాంగం, చట్టాలపై చంద్రబాబుకు గౌరవం లేదని స్పష్టమవుతోందని తెలిపారు.

ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయం భూ మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి వడమాలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

1న వాహనాల వేలం

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విజయవాడ ఈస్ట్ స్టేషన్‌లో గతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు జూన్ 1వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్టు సీఐ ఎన్ నిక్సన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో నిర్వహించే వేలంలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన రేపు బైక్ ర్యాలీ

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజల జీవన ముఖచిత్రాలను మార్చి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉంటున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నియోజకవర్గంలో విజయోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు మీసాల రాజారావు వంతెన వద్ద ఉన్న గాయత్రి కన్వెన్షన్ హాలు నుంచి ప్రారంభమై బీఆర్టీఎస్ రోడ్డు మీదుగా ఫుడ్ జంక్షన్, గవర్నమెంట్ ప్రెస్, సింగ్‌నగర్ ఫ్లైవులరోడ్డు సెంటర్ వరకూ ర్యాలీ జరుగుతుందని వివరించారు. నేతలు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్

- అసభ్యకర వీడియోలు, ఫొటోలు
- భర్త, మరిదిపై అనుమానంతో వివాహిత ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ తెరిచి అసభ్యకర ఫొటోలు పెడుతున్న ఘటనపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు తాడేపల్లికి చెందిన పందేటి పార్వతికి, 2020లో నూజివీడు మండలం వెంకట్రాదిపురానికి చెందిన నాగరాజుతో వివాహమైంది. వివాహ సమయంలో పుట్టింటి వారు ఇచ్చిన పొలం అమ్మి డబ్బులు ఇవ్వాలని నాగరాజు భార్యతో గొడవ పెట్టుకోవడంతో ఇద్దరూ విడిగా ఉంటున్నారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. కొంత కాలం క్రితం నాగరాజు మరో మహిళతో వివాహానికి సిద్ధమవ్వగా పార్వతి తన పెళ్లి, విడాకుల విషయాన్ని ఆ మహిళ కుటుంబ సభ్యులకు తెలిపింది. కొద్ది రోజుల క్రితం పార్వతి పేరిట సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి అసభ్యకరంగా మెసేజ్‌లు, వీడియోలు పెట్టారు. అవి చూసిన కొంత మంది పార్వతికి ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడటంతో ఆ అకౌంట్‌ను తన భర్త, మరిది ఆదిశేషులు క్రియేట్ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.